## క్లుప్తంగా

### పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం



బొద్దాంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

రాజాం: మహిళలు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సిద్ధీశ్వరి సూచించారు. బొద్దాం గ్రామంలో మంగళవారం ప్రపంచ మహిళా నెలసరి పరిశుభ్రత అవగాహనా దినోత్సవాన్ని నిర్వహించారు. రుతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రతపై కౌమార దశ విద్యార్థినులతో పాటు మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో చైతన్య ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌డబ్ల్యూలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఐదో తరగతిలో ప్రవేశాలు



బాడంగి గురుకులంలో అడ్మిషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న పద్మజ

బాడంగి: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో మిగులు సీట్లలో ప్రవేశాలకు మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించారు. గురుకులాల జిల్లా సమన్వయకర్త టి.పద్మజ, సంబధిత పాఠశాల ప్రిన్సిపాల్ అడ్మిషన్ల ప్రక్రియను పర్యవేక్షించారు.

### పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కళాసీ సంఘ నాయకులు

బొబ్బిలి: వచ్చేనెల 15,16,17 తేదీల్లో ఏలూరులో నిర్వహించే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పట్టణ కళాసీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సంఘం ఆఫీస్ వద్ద మంగళవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బోగాది అప్పలస్వామి, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, కళాసి సంఘం కార్యదర్శి దంతులూరి వర్మ, నాయకులు ఎర్రబాల అప్పారావు, పిరిడి అప్పారావు, పైలా రామకృష్ణ, రైతు కూలీ సంఘం నాయకులు పువ్వల సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.


### యువకుల శ్రమదానం



మంచినీటి ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న యువత

తెర్లాం: గ్రామ ప్రజలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా సురక్షితమైన తాగునీరు అందించడమే ధ్యేయమని అరసబలగ సర్పంచ్ సాయిరాం అన్నారు. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌ను స్థానిక యువత మంగళవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రక్షిత మంచినీటి పథకాన్ని శుభ్రం చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. గ్రామస్తులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాగునీటిని వృథా చేయవద్దని, నీటిని పొదుపుగా వాడాలని గ్రామస్తులను కోరారు.

### భోజనం రుచిగా వండిపెట్టాలి



వంట ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ

సంతకవిటి: మండలంలోని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే వంట నిర్వాహకులకు ఎంఈఓ సీహెచ్ భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచిగా, శుచిగా వంటలు వండిపెట్టాలని సూచించారు. అనంతరం వారితో పలు రకాల వంటలను వండించారు.

### పనులు వేగవంతం చేయాలి



అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

వంగర: మండలంలోని శివ్వాం గ్రామంలో చేపడుతున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ వై.దుర్గారావు అన్నారు. గ్రామంలో నాడు–నేడు పథకం నిధులతో చేపడుతున్న అంగన్‌వాడీ భవనాన్ని మంగళవారం పరిశీలించారు. సకాలంలో పనులు పూర్తిచేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

# అంగరంగ వైభవంగా పైడితల్లి పండగ



డొంకినవలస వీధులలో పైడితల్లి అంజలిరథం

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామంలో పైడితల్లమ్మ పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలను, అంజలి రథాన్ని గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి చీరలు చూపించి మొక్కులు చెల్లించుకున్నారు. 12 ఏళ్ల తరువాత పండగలు చేస్తుండటంతో భారీ ఏర్పాట్లు చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో ప్రతీ ఇంట్లో సందడి నెలకొంది. పండగల సందర్భంగా విజయనగరం, పార్వతీపురం, మక్కువ, సుందరాడ గ్రామాలకు చెందిన కళాకారులతో ఏర్పాటుచేసిన పులివేషాలు, కాళీమాత వేషధారణ, తప్పెటగుల్లు, కోలాట ప్రదర్శన పండగలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకుని, ఘటాలకు పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా స్థానిక ఎస్సై ఆర్.జయంతితో పాటు తెర్లాం, రామభద్రపురం ఎస్సైలు, పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం అమ్మవారి అంపకోత్సవంతో పండగ ముగుస్తుంది.



అమ్మవారి ఘటాలను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శంబంగి



విజయనగరం కళాకారుల పులివేషాల ప్రదర్శన



ఆకట్టుకున్న కాళికాదేవి నృత్య ప్రదర్శన



మక్కువకు చెందిన కళాబృందాల తప్పెటగుళ్ల ప్రదర్శన



సుందరాడ కళాబృందాల కోలాట ప్రదర్శన

## బాలల హక్కులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ మహిళా పోలీస్

తెర్లాం: బాలల హక్కులు–విధులపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని తెర్లాం–2 గ్రామ సచివాలయం మహిళా పోలీస్ తులసీ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం బాలల హక్కులు–విధులపై అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి వారి హక్కులను, విధులను తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. బాగా చదువుకుని సమాజంలో ఉత్తమ పౌరుడిగా ఎదగాలన్నారు. తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనిలో పెట్టవద్దని, వారిని బాగా చదివించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కృష్ణమూర్తితో పాటు హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన



సంతకవిటి: వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ హరనాథరావు

సంతకవిటి: మండలంలోని బొద్దూరు గ్రామంలో ఊరచెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఏపీఓ ఆర్.హరనాథరావు మంగళవారం పరిశీలించారు. పండ్ల తోటల పెంపకం, నీటి కుంటల ఏర్పాటుపై వేతనదారులకు అవగాహన కల్పించారు. నిర్దేశిత కొలతల్లో పనులు పూర్తిచేస్తే రోజుకు రూ.300 వేతనం లభిస్తుందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ కోసం టెండ్లు, ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మస్తర్లను తనిఖీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు హైమ, శ్రీను, మేట్లు ఉన్నారు.

రేగిడి: ఉపాధిహామీ పనులు రెండుపూటలా చక్కగా చేస్తే రూ.300లు వేతనం వస్తుందని ఏపీఓ ఎస్.హరనాథరావు అన్నారు. మండలంలో లచ్చారాయపురం గ్రామంలోని మంగళవాని చెరువులో జరుగుతున్న ఉపాధిపనులు పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.



రాజాం సిటీ: వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ సాయిరాం

– రాజాం సిటీ: ఉపాధి వేతనదారులు ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు చేయాలని ఏపీఓ కె.సాయిరాం అన్నారు. పెనుబాక గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రెండు పూటలా చల్లని వేలల్లో పనులకు రావాలని సూచించారు. ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు చేపడితే రూ.300లు వేతనం వస్తుందని వేతనదారులతో అన్నారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం



షిర్డీసాయికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో వెలసిన గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప, సత్యనారాయణ, దత్తాత్రేయ, నాగబంధం, నవగ్రహ, షిర్డీసాయి, సత్యసాయి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు పులఖండం శ్రీనివాసరావుశర్మ, పులఖండం శ్రీకాంత్‌శర్మ, రేజేటి శ్రీనివాసశర్మ, రేజేటి శ్రీరామశర్మ, వేమకోటి సతీష్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, రక్షా సూత్రధారణ, పంచంగవ్యప్రాశన, వాస్తుయోగినీ, క్షేత్రపాలక, సర్వతోభద్ర మండల ఆరాధనలు, ప్రధాన మూర్తులకు పంచామృత నారికేళ ఉదకములతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం సర్వదేవతా మంత్ర హవణం, తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నవధాన్యాల సాగుతో భూసారం



నవధాన్య విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం ఆర్టీఓ హేమసుందర్, ఆర్టీఎల్ ప్రకాష్ అన్నారు. మండలంలోని గార్రాజుచీపురుపల్లి, బొమ్మినాయుడువలస గ్రామాల్లో మంగళవారం ప్రకృతి వ్యవసాయ విధానం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు.

నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. వేసవి దుక్కుల సమయంలో నవధాన్యాల విత్తనాలు వేసుకోవాలని, 40 రోజుల తరువాత పంటను పొలంలో కలియ దున్నాలని సూచించారు. ఇలా చేసినట్లయితే అందులోని పోషకాలు భూమిని చేరి సారవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ బి.రమాదేవి, ఐసీఆర్‌పీ శ్రావణి, వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

### అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

బొబ్బిలి: జిల్లాలో విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి రామారావు హెచ్చరించారు. స్థానిక బృందావనం ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఎరువులు, పురుగు మందుల దుకాణ డీలర్లు, ఆర్‌బీకేల వీఏఏలతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పూర్తిస్థాయిలో సరఫరా చేయాలన్నారు. నిషేధిత, నాసిరకం ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పచ్చిరొట్ట, వరి విత్తనాలు, ఎరువుల పంపిణీపై వీఏఏలకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ ఏడీ శ్యామ్‌సుందర్, ఆర్.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌బీకేలకు చేరుకున్న వరి విత్తనాలు



నాయిరాలవలస ఆర్‌బీకేకి చేరిన విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ

రేగిడి: ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన వరి విత్తనాలు రైతుభరోసా కేంద్రాలకు చేరుకున్నాయని వ్యవసాయ శాఖ అధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. అంబఖండి, సోమరాజుపేట, చాటాయివలస, నాయిరాలవలస గ్రామాలకు వచ్చిన వరి విత్తనాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎంటీయూ 1121, స్వర్ణ, మసూరీ విత్తనాలు వచ్చాయన్నారు. మండలంలో 25 రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

### రాయితీపై వ్యవసాయ పరికరాలు అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జనార్దనరావు

రేగిడి: రైతులకు అవసరమైన ఆధునిక సాగు యంత్రాలను రాయితీపై అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నారు జనార్ధనరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ రాములమ్మకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సాగు ఖర్చులు, కూలీల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీల కొరతను అధిగమించేందుకు ఆధునిక యంత్ర పరికరాలను రైతులకు రాయితీపై అందించాలని కోరారు. అలాగే ఖరీఫ్‌లో సాగుకు తేలికరకం, తక్కువ కాలంలో పండే వరి విత్తనాలు అందించాలని కోరారు.

## ప్రతి విద్యార్థికీ విద్యా కానుక



మాట్లాడుతున్న ఎంఈఓలు తిరుమలప్రసాద్, పెంటయ్య

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం దుస్తులతో పాటు వారి చదువుకు అవసరమైన వివిధ వస్తువలతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్నామని ఎంఈవో–1,2లు తిరుమలప్రసాద్, పెంటయ్య అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. బడి ఈడు పిల్లలంతా పాఠశాలలో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. పిల్లల చదువుల భారం తల్లిదండ్రులపై పడకుండా ప్రభుత్వమే అన్ని చూసుకుంటోందన్నారు. మండలంలో 57 పాఠశాలల్లో 4,244 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారికి అందించేందుకు గాను తొలివిడతలో కొన్ని పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. మరికొద్ది రోజుల్లో పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక కిట్లు చేరుకుంటాయని, వాటిని పాఠశాలలు పునఃప్రారంభం రోజున విద్యార్థులకు అందజేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పొనుగుటివలసలో కార్డన్ సెర్చ్



రాజాం సిటీ: కార్డన్ సెర్చ్‌పై సిబ్బందికి సూచనలిస్తున్న ట్రైనీ డీఎస్పీ మహేంద్ర

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలసలో పోలీసులు మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 42 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. వాహన యజమానులు సరైన ధ్రువపత్రాలు చూపిస్తే వాటిని రిలీజ్ చేస్తామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. అపరిచిత వ్యక్తులపై నిఘా పెట్టడంతో పాటు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సంతకవిటి, రేగిడి ఎస్సైలు షేక్ శంకర్, ఇ.శ్రీనివాస్, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

**14 ద్విచక్ర వాహనాలు సీజ్**

రామభద్రపురం: మండలంలోని ఆరికతోటలో సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 14 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అపరిచితులు ఎవరైన గ్రామంలో కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నందున గ్రామస్తులు సంయమనం పాటించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.



రామభద్రపురం: సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలతో పోలీసులు

## ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం చేయాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

- వ్యవసాయశాఖ జేడీ వీటీ రామారావు

రాజాం సిటీ: వ్యవసాయశాఖ సిబ్బంది అంతా ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వ్యవసాయశాఖ జేడీ వీటీ రామారావు సూచించారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నియోజకవర్గంలోని రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల వీఏఏలు, ఆర్‌బీకే సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన మేరకు విత్తనాలు నిల్వ ఉంచుకోవాలన్నారు. విత్తనాల మొలక శాతాన్ని పరిశీలించి పంపిణీకి సిద్ధం చేయాలని సూచించారు. అలాగే భూసార పరీక్షల ఆవశ్యకతను తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పచ్చిరొట్ట ఎరువులు, నవధాన్యాల ప్రాముఖ్యతను రైతులకు తెలియజేసి సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్‌బీకేలకు ఎరువులు, సీహెచ్‌సీ పరికరాలను ముందుగా తెప్పించుకుని రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువుల దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించి స్టాకు రిజిస్టర్లు, బిల్ బుక్‌లు సక్రమంగా ఉండేలా చూడాన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ కె.చంద్రరావు, అన్నపూర్ణ పాల్గొన్నారు.

## భవిత కేంద్రాలతో దివ్యాంగులకు బంగారు భవిష్యత్



భవిత కేంద్రంలో పిల్లలను చేర్పించాలని కోరుతున్న ఎంఈఓ తిరుమలప్రసాద్

రామభద్రపురం: భవిత కేంద్రాలతో దివ్యాంగ పిల్లలకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ తిరుమలప్రసాద్ అన్నారు. మండలంలో ఐఈఆర్టీలతో కలిసి మంగళవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలని ఇంటింటి ప్రచారం చేశారు. తల్లిదండ్రులను కలిసి ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రభుత్వం భవిత కేంద్రాల ద్వారా కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాబోధనను వివరించారు. చదువుతో పాటు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, తదితర చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పిల్లలకు అవసరమైన పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నామన్నారు. భవిత కేంద్రాలలో దివ్యంగ పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ సీహెచ్ రాజేశ్వరి పాల్గొన్నారు.

## చెరువుమట్టితో పొలం సారవంతం



వన్నలి పొలాల్లో చెరువుమట్టిని వేస్తున్న రైతులు

రేగిడి: సేంద్రియ వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్‌కు ముందు పంటపొలాల్లో చెరువులో మట్టిని వేసి భూమిని సారవంతం చేసుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల చెరువు మట్టిలోని పోషకాలు పంటలకు అంది దిగుబడి బాగుంటుందని రైతులు అంటున్నారు. ఈమేరకు వన్నలి, అంబఖండి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస తదితర గ్రామాల్లో రైతులు చెరువుమట్టిని తీసుకొచ్చి పొలాల్లో వేసి చదును చేస్తున్నారు. భూసారం పెరగడంతో పాటు చీడపీడల నివారణకు ఈ మట్టి బాగా ఉపయోగపడుతుందని వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు.